క్లుప్తంగా

సీఐగా ప్రవీణ్‌కుమార్



ఎల్కతుర్తి : స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సీఐగా ఏ.ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) ఏవీ.రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన ఎస్.శ్రీనివాస్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్



పరకాల : యువతి ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడిని పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ పుల్యాల కిషన్ వివరాలు వెల్లడించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన చిలువేరు నవ్య, కామారెడ్డిపల్లె గ్రామానికి చెందిన మంద శివాజీ ఏడాదిగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన శివాజీ కొంత కాలంగా మరో యువతిని ప్రేమిస్తున్నట్లు నవ్య గుర్తించి ప్రశ్నించగా గొడవ జరిగింది. తాను మోసపోయినట్లు గుర్తించిన నవ్య ఈనెల 7న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నవ్య తండ్రి చిలువేరు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శివాజీని సోమవారం అరెస్ట్ చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తోంది. గ్రామంలో తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తోందని గ్రామస్థులు మీడియా ఎదుట సోమవారం వాపోయారు. ఇప్పటికే పలువురు కుక్కకాటు బారిన పడ్డట్టు తెలిపారు. కుక్కల నుంచి కాపాడాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కుక్కల నుంచి ప్రజలను కాపాడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు వార సంత, వాటర్ ప్లాంట్ నిర్వహణకు వేలం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే కూరగాయల వార సంతతోపాటు 2023–24 సంవత్సరానికి సంబంధించి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకుగాను నేడు (మంగళవారం) వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఈఓ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని, ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

24న..

శాయంపేట : మండల కేంద్రంలోని కూరగాయాల సంత, షాపింగ్ కాంప్లెక్స్ గదులకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కందగట్ల రవి, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆరు గదులకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈనెల 23న సాయంత్రం 5 గంటలలోపు అంగడి వేలానికి రూ.20 వేలు, షాపింగ్ కంప్లెక్స్‌కు రూ.10 వేలు గ్రామపంచాయతీ కార్యదర్శికి చెల్లించాలని, రూ.25 వేల విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. డిపాజిట్‌దారు మాత్రమే వేలంలో పాల్గొనాలని, షాపును దక్కించుకున్న వారు ఈనెల 29న సాయంత్రం 5 గంటలలోపు 50 శాతం మొత్తాన్ని జీపీకి చెల్లించాలని తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : అజాగ్రత్తగా లారీ నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన గుంటి మల్లేష్ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని ములుగు నుంచి హనుమకొండకు వెళ్తుండగా ఆదివారం రాత్రి గూడెప్పాడ్ జంక్షన్ వద్ద భూపాలపల్లి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులకు, ఆటోడ్రైవర్ మల్లేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులు వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స చేయించుకున్నారు. మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి లారీ డ్రైవర్ క్యాతరాయి శ్రీశైలంపై కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులకు తీర్మానం

ఐనవోలు : స్థానిక పీహెచ్‌సీలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేసినట్లు ఎంపీపీ మార్నేని మధుమతి తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్ పాషా హాజరు కాగా ఎంపీపీ మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సర్పంచ్ జున్ను కుమారస్వామి, ఎంపీటీసీలు సోమేశ్వర్‌రావు, రాజు, హెచ్ఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకుంటాం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఆత్మకూరు : అక్కంపేటలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని అక్కంపేట, నాగయ్యపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకొని పంట నష్టాన్ని అంచనా వేసి జాబితా తయారు చేయాలని సూచించారు. సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, సర్పంచ్ విజయ హంసాల్, నాయకులు అంబటి రాజస్వామి, కూస కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఊరుగొండ, దుర్గంపేట్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే ధర్మారెడ్డి పరిశీలించి మాట్లాడారు. మొక్కజొన్న, వరి, క్యాబేజీ, అరటి, కరబూజ, పుచ్చ, మిరప. కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రైతులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీపీ శంకర్, ఏడీఏ రవీందర్, ఏఓ శ్రీనివాస్, తహసీల్దార్ రియాజుద్దీన్, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, దళితబంధు చైర్మన్ కృష్ణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ సదానందం, మండల అధ్యక్షుడు రాము, తదితరులున్నారు.

వ్యవసాయ అధికారుల పరిశీలన

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి, ఉడుతగూడెం, గర్మిళ్లపెల్లి, సింగారం, పున్నేలు, పంథిని, ఐనవోలు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను ఏడీఏ మేడి దామోదర్‌రెడ్డి పరిశీలించారు. పంట నష్ట వివరాలను నమోదు చేసినట్లు ఏఓ అడప కవిత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మజ్జిగ జైపాల్, ఎంపీటీసీ కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్ పరిశీలన

మండలంలోని నందనంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు పర్యటించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొనకటి రాఘవులు టమాట, మక్కజొన్న, వరి, మామిడి తోటలను సందర్శించారు. మండల అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్ ఉడుతగూడెంలో పర్యటించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మంజుల, ఆరోగ్యం, సునీత, నాయకులు సుధాకర్, జక్కుల రాజు, ఆత్మ డైరెక్టర్ కుసుంబ దేవేందర్, మండల కోఆప్షన్ సభ్యుడు గుంశావలీ, సతీష్, లక్ష్మణ్‌రావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి : ఏఐకేఎస్

మండలంలోని ముల్కలగూడెం, వెంకటాపురం, వనమాల కనపర్తి, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో ఏఐకేఎస్ నాయకులు పర్యటించారు. మామిడి, టమాట, తదితర పంటలను పరిశీలించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడారు. రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి పర్వతాలు, ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మేకిరి మోహన్‌రావు, నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలనకు ఆకర్షితులై చేరిక

- ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలనకు ఆకర్షితులై పలువురు ఆ పార్టీలో చేరుతున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని బాహుపేట గ్రామానికి చెందిన పలువురు పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో సోమవారం చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో ప్రజల్లో పార్టీ పట్ల ఆదరణ పెరుగుతోందని చెప్పారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ బత్తిని వెంకటేశ్వర్లు, బత్తిని మొగిలి, రమేష్, మురళీ, సంపత్, సైదయ్య తదితరులుండగా కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు బొకూరి భద్రయ్య, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటీఆర్ రాజీనామా చేయాలి : బీజేపీ



నిరసన దీక్షలో మాట్లాడుతున్న భిక్షపతి

పరకాల : టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని బీజేపీ ఆలేరు పాలక్, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి డిమాండ్ చేశారు. లీకేజీకి నిరసనగా ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. గ్రూప్–1 పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని చెప్పారు. బాధిత అభ్యర్థులకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ పరకాల అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణరావు, అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, భద్రాద్రి బీజేపీ ప్రభారి దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, కార్యదర్శి ఎర్ర రామన్న, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, కొలనుపాక భద్రయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గోదా చిన్న, ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్, రాజారపు శివకుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



శిక్షణను ప్రారంభిస్తున్న సర్పంచ్ సాంబయ్య

శాయంపేట : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే జీఎంఆర్‌ఎం ట్రస్ట్ లక్ష్యమని గట్లకానిపర్తి సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు గండ్ర గౌతంరెడ్డి ఏర్పాటు చేసిన జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ద్వారా విన్ మోటార్స్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను సర్పంచ్ సాంబయ్య సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులకు కొడుకు, యువనేత ట్రస్ట్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణను నిరుద్యోగ యువతకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బత్తిని రజని సత్యనారాయణ, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూషబోయిన సురేష్, కోఆప్షన్ సభ్యుడు గుర్రం అశోక్, మాజీ ఎంపీటీసీ బొమ్మకంటి ఆనందం, నాయకులు బుస్స సంపత్, రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు, జరిమానా

కమలాపూర్ : వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ హనుమకొండ నాల్గో అదనపు ఎంఎం కోర్టు జడ్జి మట్ట సరిత సోమవారం తీర్పు ఇచ్చినట్లు సీఐ బొలుమల్ల సంజీవ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన తోట తిరుపతి కూతురు దీపిక స్నేహితులతో కలిసి అదే గ్రామానికే చెందిన కసుబోజుల జగదీశ్వర్‌కు చెందిన డాబాపై ఆడుకుంటుండగా డాబాపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలి దీపిక ఎడమ చేయి, రెండు కాలి వేళ్లు తెగిపోయాయి. ఈ కేసుకు సంబంధించి తుది వాదనల అనంతరం జగదీశ్వర్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. అలాగే మండలంలోని నేరెళ్లకు చెందిన ఆడెపు తిరుపతి తల్లి సరోజన ఆమె పొలంలో పని చేసుకుంటుండగా పాత అదే గ్రామానికి చెందిన బాసిరి రాజేశ్వర్‌రావు భూతులు తిడుతూ కర్రతో దాడి చేయగా ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఈ కేసుకు సంబంధించి రాజేశ్వర్‌రావుకు 6 నెలల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామానికి చెందిన మోడెం రాజయ్య (65) అదృశ్యమైనట్టు అతడి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. రాజయ్య ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువుల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోండి



పరకాల : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సోదా అనిత

పరకాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. పట్టణంలోని 1వ వార్డులోని సీఎస్‌ఐ సెయింట్ థామస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 23 వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కంటి సమస్యలున్న వ్యక్తులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, ఒంటేరు సారయ్య, శనిగరపు రజని, మార్క ఉమాదేవి, చందుపట్ల సుజాత, పోరండ్ల సంతోష్, దామెర మొగిళి, నల్లెల జ్యోతి, పాలకుర్తి గోపీ, ఏకు రాజు, కంటి వైద్యురాలు అనూష, తదితరులు పాల్గొన్నారు.

వీరనారాయణపూర్‌లో..

ఎల్కతుర్తి : మండలంలోని వీరనారాయణ పూర్‌లో గోపాల్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ చదిరం వసంత ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, ఎంపీడీఓ తూర్పాటి సునీత, వైద్యురాలు శోభారాణి, ఎంపీటీసీ అనూష, ఏపీఓ అనిత, ఉపసర్పంచ్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వడంలో నిర్లక్ష్యం



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 633లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు జీఓ నెంబర్ 58 ప్రకారం పట్టాలివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి విమర్శించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీసీ కాలనీ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సోమవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. పేదలు గుడిసెలు వేసుకుని 75 రోజులు గడచినా పట్టాలివ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చలమల్ల రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిల్ల దేవయ్య, మారపల్లి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



రిషిని అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మోడెం రిషి సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిషి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో తెలంగాణ సాఫ్ట్ బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎంపిక చేశారని పేర్కొన్నారు. మే 15 నుంచి 20 వరకు భూటాన్‌లో నిర్వహించనున్న పోటీల్లో తెలంగాణ అసోసియేషన్ తరపున ఆడనున్నాడని చెప్పారు. రిషి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ప్రోత్సహించిన పీఈటీ సుమలతను ప్రజాప్రతినిధులు అభినందించారు. రిషి జాతీయ పోటీల్లో పాల్గొననుండడం పట్ల జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోవింద సురేష్, రిషి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అవగాహన సదస్సు ఏర్పాటు చేయండి



జీఎంకు పూలమొక్క బహూకరిస్తున్న సర్పంచ్


శాయంపేట : ఎస్సీ కార్పొరేషన్ అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా మండలంలోని మైలారం గ్రామంలో సదస్సు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్‌ను సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ కోరారు. అయన ఆధ్వర్యంలోని బృందం హైదరాబాద్‌లోని కార్యాలయంలో జీఎం ఆనంద్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క బహూకరించింది. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. దళితులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అవకాశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనందకుమార్‌ను సోమవారం మైలారం సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఎస్సీ కార్పోరేషన్‌పై సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. జీఎంను కలిసిన వారిలో మసికె కల్యాణ్ తదితరులున్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



కమలాపూర్ : మండల కేంద్రంలోని కాశిపల్లిలో కొత్తగా మంజూరైన మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, వార్డు సభ్యులు పుల్ల సరిత, వెంగళ విజయ్, అంగన్‌వాడీ టీచర్ ఎస్.పద్మ, నాయకులు పుల్ల శ్రీనివాస్, అలీ, హుస్సేన్, కల్యాణి కుమార్, ఆశ కార్యకర్త కవిత, తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధురాలికి సాయం



ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన పేద వృద్ధురాలు దేవులపల్లి మల్లికాంబకు స్థానిక కడియం యువసేన సభ్యులు మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. మల్లికాంబ ఇంటి నిర్మాణం గోడల వరకు కొనసాగి నిలిచిపోయిందని చెప్పారు. ఇంటిపై కప్పు నిర్మించుకునేందు కోసం సాయం అందించినట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

శాయంపేట : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పెంబర్తి హరీష్, రమేష్, రాజు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఈటల’ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్ : మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ 59వ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపూర్‌లో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఈటల అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, హుజూరాబాద్ అసెంబ్లీ కోకన్వీనర్ మాట్ల రమేష్, సర్పంచ్ చేలిక శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ మౌటం రమేష్‌బాబు, వార్డు సభ్యుడు మౌటం శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కొలిపాక తిరుపతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎం.కవిత, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచార కార్యదర్శిగా రాజశేఖర్




ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన వక్కల రాజశేఖర్ బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హనుమకొండలోని క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించారంటూ ఎమ్మెల్యేకు, నాయకులకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం

శాయంపేట : 20 లీటర్ల గుడుంబాను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాధరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సూర్యానాయక్ తండా నుంచి గుడుంబా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు సోమవారం రూట్ వాచ్ చేస్తుండగా గుగులోతు సదర్‌లాల్, భూక్య మొగిలి వారి ద్విచక్ర వాహనాలపై 10 లీటర్లు చొప్పున గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం సూర్యానాయక్‌తండాకు చెందిన సదర్‌లాల్, మొగిళి, సురేష్, మాలోతు బీమానాయక్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, శ్రీనివాస్, రవీందర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనానికి భూమి వితరణ



సర్పంచ్‌కు భూదాన పత్రం అందజేస్తున్న సాంబయ్య

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండలంలోని లోక్యాతండాలో జీపీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన మురావత్ సాంబయ్య 5 గుంటల భూమిని వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మురావత్ అనురాధ లింగం మాట్లాడారు. లోక్యాతండా జీపీగా ఏర్పడగా నాలుగేళ్లుగా ఓ చిన్న ఇంట్లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం కోసం ఐటీడీఏ నుంచి రూ.20 లక్షలు మంజూరు కాగా స్థలం లేక ఇబ్బందులు పడుతుండగా సాంబయ్య స్పందించి భూదానం చేస్తూ పత్రం అందజేశారని వివరించారు. సాంబయ్యకు సర్పంచ్ అనురాధ లింగం పంచాయతీ పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కమలాపూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థినులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థినులు నూరు శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. అత్యధిక 10 జీపీఏ సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అర్చన, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.